



ప్రలోభపర్వం

- జిల్లాలో ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- ప్రలోభాలతో ఓటర్లకు ఎరవేస్తున్న పార్టీలు
- చివరి సమయాన్ని సద్వినియోగం చేసుకునే ప్రయత్నాలు
- పార్లమెంట్ పరిధిలో ఎన్నికల అధికారులకు విధుల కేటాయింపు
- గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు



ఆదిలాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి బ్రేక్ పడింది. గత కొద్దిరోజులుగా పోటాపోటీగా ప్రచారాన్ని చేపడుతున్న అభ్యర్థులు.. ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. జిల్లాలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలను సైతం లెక్క చేయకుండా ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు అభ్యర్థులు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. శనివారం సాయంత్రం 5గంటలతో బహిరంగ ప్రచారానికి తెరపడడంతో అంతా సైలెంట్‌గా పోయింది. మే 13న నిర్వహించే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో అధికార యంత్రాంగంతో పాటు అభ్యర్థుల్లో హడావుడి మొదలయ్యింది. చివరి రోజుల ప్రచారమే అభ్యర్థుల గెలుపోటములపై ఎంతో ప్రభావం చూపనుంది. అయితే ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులంతా బలమైన నేతలే కావడంతో హోరాహోరీ ఫైట్ సాగుతోంది. దీంతో ఎవరు గెలిచినా.. స్వల్ప మెజార్టీతోనే గట్టెక్కవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వరుసగా రెండవ సారి గెలిచేందుకు ఆరాట పడుతున్న బీజేపీ కొంత అభద్రత భావంతోనే కనిపిస్తోంది. ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలతో కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది. త్రిముఖ పోటీలో గెలుపు ఖాయమన్న ధీమాతో బీఆర్ఎస్ ఉంది. గెలిచే పరిస్థితి లేకపోయినా.. మెజార్టీ ఓట్లను సాధించేందుకు గుర్తింపు పొందిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో భిన్నమైన ఫలితాలు రావడంతో అభ్యర్థుల గెలుపుపై అంచనాలు అంతా తేలికైనా పనేమీ కాదంటున్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 16లక్షల 50వేల 175 ఓటర్లు కాగా.. ఇందులో పురుషులు 8లక్షల 4వేల 875, స్త్రీలు 8లక్షల 45వేల 213, ఇతరులు 87 మంది ఓటర్లు ఉన్నారు. దాదాపుగా నెల రోజులకు పైగా అభ్యర్థులు కుటుంబానికి దూరంగా ఉంటూ ప్రచారంతో బిజీ బిజీగా గడిపారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో ఏ పార్టీ పూర్తిస్థాయిలో ప్రచారాన్ని చేపట్టిన పరిస్థితి కనిపించ లేదు. కేవలం నియోజకవర్గ, మండలస్థాయి ప్రచారానికే అభ్యర్థులు ఎక్కువగా ప్రాధాన్యతనిచ్చారు. చివరి రోజు ప్రధాన పార్టీల అభ్యర్థులంతా తమ సొంత నియోజకవర్గం, మండల కేంద్రాలలోనే ప్రచారాన్ని చేపట్టారు. ముఖ్య నేతలను నేరుగా కలుస్తూ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాల పై చర్చిస్తున్నారు. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులంతా సర్వశక్తులను ఒడ్డుతున్నారు.

జోరుగా మద్యం పంపకాలు

గతంలో మాదిరిగానే నేతలు ప్రలోభాలకు తెరలేపి ఓటర్లకు ఎర వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా డబ్బు, మద్యం పంపిణీ జరిగినా.. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం డబ్బుల పంపిణీ జోలికి వెళ్లినట్లు కనిపించడం లేదు. ప్రధాన పార్టీలన్నీ మద్యాన్ని సరఫరా చేస్తూ ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పటికే పలు నియోజకవర్గాలలో మద్యం పంపిణీ జరిగిపోయినట్లు తెలుస్తుంది. వైన్స్ షాపుల నుంచి భారీగా మద్యం కొనుగోళ్లు జరుగుతున్నా.. అధికారులు చూసీచూడనట్లే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిత్యం రూ.లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నా.. ఎన్నికల అధికారులు సీరియస్‌గా దృష్టి సారించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని శనివారం 6గంటల నుంచి సోమవారం 6గంటల వరకు అన్ని రకాల మద్యం దుకాణాలను మూసి వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖాధికారులు పేర్కొంటున్నారు. అలాగే విందులు, వినోదాలతో పలు సంఘాల ఉద్యోగు లకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ పరిధిలో నెలకొన్న త్రిముఖ పోరులో ఉద్యోగుల ఓట్లు కీలకం కానున్నాయి. జాతీయ రాజకీ యాలతో ముడిపడి ఉన్న లోక్‌సభ ఎన్నికల్లో ఉద్యోగ వర్గాలు ఏ పార్టీకి మద్దతుగా నిలుస్తారో? నన్నదే సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

సోషల్ మీడియా ప్రచారం

బహిరంగ ప్రచారానికి గడువు సమయం ముగిసిపోవడంతో ఇక ప్రధాన పార్టీల అభ్యర్థులు సోషల్ మీడియా వేదికగా ప్రచారానికి దిగుతున్నారు. వాట్సాప్ గ్రూపులతో పాటు ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో వీడియోలను పోస్టు చేస్తూ.. ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. భావోద్వేగ వీడియోలను పోస్టు చేస్తూ ఓటర్లకు గాలం వేసే పనిలో పడ్డారు. పార్టీ అభ్యర్థుల సందేశాలను ఓటర్లకు చేరవేసే విధంగా కార్యకర్తలు, నేతలు వాట్సాప్ స్టేటస్‌లను పెడుతూ ప్రచారానికి దిగుతున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా ప్రచారంపై ఎన్నికల అధికారులు నిఘా సారిస్తున్నామని చెబుతున్నా.. అడ్డుకట్ట పడినట్లు మాత్రం కనిపించడం లేదు. ఆయా కుల సంఘాలు, మత పెద్దలకు ఫోన్లు చేస్తూ మద్దతుగా నిలవాలని కోరుతున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆయా పార్టీల కార్యకర్తలు, నేతలు పోటాపోటీగా పోస్టులు చేస్తూ తీవ్ర విమర్శలకు దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో సోషల్ మీడియా పోస్టులు వివాదాలకు కూడా దారి తీస్తున్నాయి.

2,200 పోలింగ్ స్టేషన్లు

లోక్‌సభ పరిధిలో మొత్తం 2,200 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల పోలింగ్ పర్యవేక్షణకు 2637 మంది పీవోలు, 2637 మంది ఏపీవోలు, 5274 మంది ఓపీవోలను నియమించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో మొత్తం 292 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. 350 మంది ప్రీసైడింగ్ అధికారులు.. మరో 350 మంది సహాయ పీవోలు, 700 మంది వోపీవోలను నియమించారు. బోథ్ నియోజకవర్గంలో 306 పోలింగ్ స్టేషన్లకు గాను పీవోలు 367, ఏపీవోలు 367, వోపీవోలు 734, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 356 పోలింగ్ స్టేషన్లు ఉండగా 427 మంది పీఓలు, 427 మంది ఏపీవోలు, 854 మంది ఓపీఓలు, సిర్పూర్(టి) నియోజకవర్గంలో 320 పోలింగ్ స్టేషన్లకు గాను.. 384 మంది పీవోలు, 384 ఏపీవోలు, 768 వోపీవోలు, నిర్మల్ నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలకు గాను 367 మంది పీవోలు, 367 మంది ఏపీవోలు, 734 వోపీవోలు, ఖానాపూర్ నియోజకవర్గంలో 309 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. 369 మంది పీవోలు, 369 మంది ఏపీవోలు, 738 వోపీవోలు, ముథోల్ నియోజకవర్గంలో 311 పోలింగ్ కేంద్రాలకు 373 మంది పీవోలు, ఏపీవోలు, 746 మంది వోపీవోలను నియమించారు. ఇలా నియోజకవర్గాల వారీగా పోలింగ్ సజావు గా నిర్వహించేందుకు అధికారులు అన్నిరకాల ఏర్పాట్లను చేస్తున్నారు.

బోథ్ పరిధిలో 1,748 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

బోథ్, మే 11: బోథ్ నియోజకవర్గం పరిధిలో శనివారం పోస్టల్ బ్యాలెట్ పైన 1,748 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 312మంది ఇంటి వద్ద ఓటు వేయగా 1436 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో నిర్వహణ కోసం ఎన్నికల అధికారిగా సంతోష్‌రెడ్డి వ్యవహరించారు. పోస్టల్ ఓట్లను శుక్రవారం రాత్రి వరకు ఆదిలాబాద్ చేరమేయడం జరిగింది.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- బోథ్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కుష్బుగుప్త
- కార్యాలయ ఆవరణలో ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు

బోథ్, మే 11: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించవద్దని బోథ్ నియోజకవర్గ ఎన్నికల అధికారి కార్యాలయ ఆవరణలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కుష్బుగుప్త పలు సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎన్నికల కోసం వినియోగించే వాహనాలను దుర్వినియోగం చేయవద్దన్నారు. దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వస్తే తగు చర్యలు తప్పవన్నారు. పోలింగ్ స్టేషన్‌ల వరకు వెళ్లేందుకు ఆయా రూట్‌లలో రోడ్లకు అనుగుణంగా వాహనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతీ ప్రభుత్వ అధికారి ఎన్నికల ఉద్యోగికి గుర్తింపు కార్డులను అందిస్తామన్నారు. గ్రామాలలో సిబ్బందికి భోజన సౌకర్యం, అల్పాహారం కల్పిస్తామన్నారు. తీవ్రమైన ఎండలను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిబ్బంది వెంటనే ఉంచుతామని సెల్‌ఫోన్లను సైతం సిబ్బంది ఛార్జింగ్ పెట్టుకుని ఉండాలన్నారు. ఒకటి నుంచి 13 పోలింగ్ బూత్‌లకు చేరే ఉద్యోగులకు ముందుగా ఆయా బూత్‌లకు పంపించే ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి వసతి కూలర్లను సైతం ఏర్పాటు చేయాలని వివరించామన్నారు. అందుకు అవసరమైన నగదును సైతం ఇప్పించామన్నారు. వీధిలోకి వెళ్లే సిబ్బందికి ఏమైనా కష్టాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వారు ఆదివారం ఉదయం 3గంటల నుంచి రిపోర్టు చేయాల్సి ఉంటుందని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

- 'పోలింగ్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు'

బోథ్: బోథ్ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని బోథ్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కుష్బుగుప్త పేర్కొన్నారు. శనివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ పరిధిలో 35 రూట్‌లలో 2 వేల 774 మంది ఉద్యోగులు ఎన్నికలను నిర్వహిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 38 సమస్యాత్మక గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆదివారం ఉదయం 3 గంటలకే ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. పరిధిలోని ఒకటి నుంచి 13 బూత్‌లు భీంపూర్ మండలంలో ఉండటం వలన అక్కడికి విధులు నిర్వహించేందుకు వెళ్లే సిబ్బందిని ముందుగా పంపించడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది సకాలంలో చేరే విధంగా



ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎన్నికల అధికారి కుష్బుగుప్త

ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు సీఆర్‌పీఎఫ్ పోలీసులతో పాటు స్థానిక పోలీసు అధికారులు ప్రత్యేక బెటాలియన్ పోలీసులు వాహనాల వెంట వెళ్లడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన బందోబస్తు ఉంటుందని 200మీటర్ల దూరంలో ప్రజలను ఉంచుతామన్నారు. 200మీటర్లు దూరం కంటే దగ్గరగా వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు పెట్టవలసి ఉంటుందన్నారు. హోటల్ రఘు ఇబ్బందులు కలుగకుండా మంచినీటి వసతితో పాటు టెంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎన్నికల విధులకు వెళ్లే సిబ్బందికి భోజనం వసతి, మంచినీటి వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఓటు వేసేందుకు వచ్చే వృద్ధుల కోసం వీల్ చైర్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్ లేని గ్రామాల నుంచి సమాచారం వచ్చేందుకు గాను పోలీసులకు హ్యాండ్ సెట్‌లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ గంటకు పోలింగ్ కేంద్రాల్లో నుంచి పోలింగ్ శాతం సమాచారాన్ని తెలుసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటలల వరకు ఎన్నికలను నిర్వహించే వారిని ఈసారి ప్రభుత్వం సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అదనంగా గంట సమయం పెంచడం జరిగిందన్నారు. చేరవేసేందుకు వెబ్‌కాస్టింగ్ ప్రతీఒక్కరు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని ఆమె కోరారు.

240 మద్యం బాటిళ్ల పట్టివేత

ఉట్నూర్, మే 11: ఉట్నూర్ మండలంలోని లింగోజి తండా ఎక్స్‌రోడ్డు వద్ద బెల్ట్‌షాప్‌లో అమ్మకానికి తీసుకు వెళ్తున్న 240 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎన్నికల కమిషన్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం డిప్యూటీ తహసీల్దార్ జాదవ్‌రమేష్ శనివారం తెలిపారు. షాంపూర్‌కు చెందిన సత్యనారాయణ బెల్ట్‌షాపులో మద్యం విక్రయించడానికి తీసుకు వెళ్తుండగా రూ.26 వేల 500 విలువ గల 240 బాటిల్స్ పట్టుకొని ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎక్సైజ్ ప్రోహిబిషన్ అధికారులకు అప్పగించామన్నారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ సత్తన్న, తదితరులు ఉన్నారు.



మద్యం బాటిళ్లు పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ఉట్నూర్, మే11: పదవ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలలో చదువుకోవాలని భావిస్తున్న గిరిజన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో 7.0 జీపీఏ సాధించిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 30 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్‌లో విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మొబైల్ నెంబర్, ఈ మెయిల్‌ఐడీ, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బీఏఎస్, హెచ్‌పీఎస్, సీబీఎస్‌సీ విద్యార్థులు మాత్రం జిల్లా విద్యాశాఖ అధికారితో మాపింగ్ చేయించుకోవాలని ఆయన తెలిపారు. స్టడీ సర్టిఫికేట్లు 4వ తరగతి నుంచి పదో తరగతి వరకు తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే చదివి ఉండాలన్నారు. హాస్టల్ బోనాఫైడ్ సర్టిఫికెట్ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ విద్యార్థులకు మాత్రమే అవకాశం కల్పించడం జరిగిందని జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారి పేర్కొన్నారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

గుడిహత్నూర్, మే 11: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు.



గుడిహత్నూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి

శనివారం గుడిహత్నూర్ లో నిర్వహించిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను మీ అమూల్యమైన ఓటును హస్తం గుర్తుకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ ఆడేశీల, నాయకులు, కరుణాకర్, అజయ్, మాధవ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా సామల సదాశివ జయంతి



నిర్మల్ కల్చరల్, మే 11 : జిల్లాకేంద్రంలో శనివారం బహుముఖ ప్రజ్ఞాశాలి సామల సదాశివ 96వ జయంతి తెలంగాణ రచయితల సంఘం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సదాశివ బహుభాషా కోవిదుడని పలువురు కవులు ప్రశంసించారు. కొమురం భీమ్ చరిత్రను పదో తరగతిలో పాఠ్యాంశంగా చేర్చిన ఘనత సదాశివదని అన్నారు. డాక్టర్ దామెర రాములు, తుమ్మల దేవరావు, డాక్టర్ మురళీధర్, అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, నేరెళ్ల హన్మంతు, పాల్గొన్నారు.



నాగపూర్ వద్ద రోడ్డు పై పడిన భారీ వృక్షం



ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు

రోడ్డుపై విరిగిపడిన చెట్టు

● రోడ్లు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఉట్నూర్, మే 11: రోడ్లు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. వర్షాకాలం రాకముందే ఆర్అండ్‌బి రహదారుల వెంట ఉన్న భారీ చెట్లు, కొమ్మలు గాలులు వేసినప్పుడు రోడ్ల పై పడుతుండడంతో ప్రమాదాలు తృటిలో తగ్గుతున్నాయి. ఉడుంపూర్ అడవి ప్రాంతం నుంచి గుడిహత్నూర్ వరకు ఉన్న రహదారి వెంట రోడ్డుకు ఇరువైపులా కొన్నేళ్ల నాటి చెట్లు ఉండడంతో రోడ్డు పైకి వంగిపోయి గాలులు వీచినప్పుడు పడిపోతున్నాయి. ఫలితంగా రాంపూర్, గండి, భీర్సాయిపేట, దంతనపల్లి, కోలాంగూడ, నాగపూర్, షాంపూర్, ఇంద్రవెల్లి, శంకర్‌గూడ తదితర ప్రాంతాలలో రోడ్లపై చెట్లు పడుతుండడంతో వాహనాలు నిలిచిపోయి బస్సులలో ఉన్న ప్పరయాణికులు, కారులో జీపులలో ఉన్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం కురిసిని చిన్నపాటి గాలివానకు ఉట్నూర్ పట్టణంతో పాటు నాగపూర్, గోదారగూడ వద్ద చెట్లు పడిపోవడంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8గంటల వరకు వాహనాలు నిలిచిపోయాయి. జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సైతం ఉట్నూర్ ప్రాంతంలో పర్యటనకు వచ్చి తిరుగు ప్రయాణంలో నాగపూర్ వద్ద ఆగిపోయారు. మంచిర్యాల, ఒంగోలు, గుంటూరు, ఆసిఫాబాద్, ఉట్నూర్ తదితర ప్రాంతాలకు వచ్చే బస్సులు నిలిచిపోవడంతో దూర ప్రాంత ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రతీ యేటా ఇలా జరుగుతున్న ఆర్అండ్‌బి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉండి పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆర్అండ్‌బి అధికారుల వద్ద గ్యాంగ్‌మెన్‌లు ఉన్నప్పటికి వారితో పనులు చేయించుకోలేక అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల ఇబ్బందులు అవుతున్నందున పోలీసు అధికారులు నిర్లక్ష్యం చేసే అధికారులపై కేసులు వేసి చర్యలు తీసుకో వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఓటు వేసేందుకు స్వస్థలాలకు ప్రయాణం

● రోడ్లు భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ట్రాఫిక్ ఇబ్బందులు



భైంసా బస్టాండ్ బస్సు వద్ద ప్రయాణికులు రద్దీ



ప్రయాణీకులతో కిక్కిరిసిపోయిన భైంసా బస్టాండ్

భైంసా, మే 11 : లోక్‌సభ ఎన్నికలలో భాగంగా జరుగనున్న పోలింగ్‌లో పాల్గొనేందుకు గాను ఆయా ప్రాంతాల్లోని ఓటర్లు తమ తమ స్వస్థలాలకు తరలి వెలుతున్నారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు అధికశాతం ఓటర్లు తమ ప్రాంతాలకు శనివారం తరలివెళ్లారు. దీంతో జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ కేంద్రాల్లోని బస్టాండ్లు తమ తమ స్వస్థలాలకు తరలివెలుతున్న ఓటర్లతో కిక్కిరిసిపోయి కనిపించాయి. ఆదివారం సెలవు ఉండటంతో అధిక శాతం ఓటర్లు ఒక రోజు ముందుగానే పోలింగ్‌లో పాల్గొనేందుకు తమ స్వస్థలాలకు బయలుదేరి పోయారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వివిధ రూట్లలోని బస్సు సర్వీసులన్నీ రద్దీగా కనిపించాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఉపాధి, ఉద్యోగ,వ్యాపార,వాణిజ్య కార్యక్రమాల నిర్వాహణ కోసం నిర్మల్, భైంసా, ఖానాపూర్, ముథోల్, కుభీర్ తదితర ప్రాంతాల్లో వచ్చి నివాసముంటున్నారు. వీరంతా లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు గాను తమ తమ ప్రాంతాలకు తరలిపోతుండటంతో జిల్లాలోని ప్రధాన బస్టాండులన్నీ సందడిగా మారిపోయాయి.


తప్పుడు సమాచారాన్ని

ప్రచారం చేస్తే కఠినచర్యలు



భైంసా, మే 11 : పట్టణ పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో ఘటనలు, నమోదైన కేసులపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ రాజారెడ్డిలు వెల్లడించారు. శనివారం పట్టణ పరిధిలో పోలీసు కవాతు నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేటీఅర్ రోడ్ షో ముగిసిన అనంతరం ఇద్దరు వ్యక్తులపై కొంత మంది కర్రలు,ఫ్లకార్డులు, ఇనుప రాడ్లతో దాడి చేయడం మూలంగా తీవ్ర గాయాలయ్యాయని పెర్కొన్నారు. సంబంధిత దాడి ఘటనపై బాధితుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లుగా వివరించారు. సీసీటీవీ కెమెరాల్లోని వీడియోల ఆధారంగా హత్యాయత్నం ఘటనకు పాల్పడిన 23 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా తెలిపారు.ఇందులో కొంత మంది మాలధారణ చేసిన స్వాములు కూడా ఉన్నారని చెప్పారు. అయితే కొంత మంది కేటీఅర్ రోడ్ షోను అడ్డుకున్నందుకే కేసు నమోదు చేసినట్లుగా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రచారానికి పాల్పడుతున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అంతేకాకుండా వాట్సప్ గ్రూప్‌లలో రోడ్ షో ఘటనలపై తప్పుడు సమాచారాన్ని పోస్టులు పెడుతున్న వారితో పాటు సంబంధిత గ్రూప్ అడ్మిన్ పై చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా శనివారం సాయంత్రం ప్రచారం ముగిసిన దృష్ట్యా రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రచారం చేపట్టవద్దన్నరు. ఎక్కడైన ప్రచారం జరిగితే పోలీసు శాఖకు సమాచారం అందివ్వాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో కొనసాగేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావిస్తూ పోలీసుశాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఐటీబీ పోలీసు బలగాలతో పట్టణ పరిధిలోని ప్రధాన వీధుల మీదుగా పోలీసు శాఖ కవాతు నిర్వహించింది.

కేటీఆర్‌పై భైంసా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



భైంసా, మే 11 : నిర్మల్ జిల్లా భైంసాలో గురువారం జరిగిన బీఆర్ఎస్ రోడ్‌షోలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఅర్‌పై చర్యలు తీసుకోవాలంటూ భైంసా పట్టణ పోలీసు స్టేషన్‌లో స్థానిక న్యాయవాది తాడేవార్ సాయినాథ్ ఫిర్యాదు చేశారు. శనివారం మరో న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పోలీసుస్టేషన్‌కు వచ్చిన సాయినాథ్.. కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని టౌన్ సీఐ రాజారెడ్డికి ఫిర్యాదు పత్రాన్ని అందించారు. అనంతరం సాయినాథ్ మాట్లాడుతూ.. గత గురువారం భైంసాలో జరిగిన రోడ్‌షోలో కేటీఆర్ పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు చేశాడని ఆరోపించారు. కేటీఆర్ తన ప్రసంగంలో భాగంగా పోలీసులు ఉన్నారా!? చచ్చిపోయారా!? మీకు డ్యూటీ చేయస్తుందా!? దమ్ము లేదా!? అంటూ పరుష పదజాలం ప్రయోగిస్తూ పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశాడు. ఇదే క్రమంలో పోలీసులపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తుండగా.. నివారించకుండా వ్యవహరించిన రోడ్‌షో నిర్వాహకులైన బీఆర్ఎస్ ప్రతినిధులు డా.పడకంటి రమాదేవి, విలాస్ గాదేవార్, లోలం శ్యాంసుందర్, మాజీ మంత్రి జోగు రామన్న, డా. కిరణ్ కోమ్రేవార్‌లపై సైతం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు సాయినాథ్ వివరించారు.


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ఆలం


పాల్గొన్న అధికారులు, సిబ్బంది

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా..

జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ఆలం ● పోలీసు ముఖ్య అధికారుల సమావేశంలో పలు సూచనలు, సలహాలు

ఆదిలాబాద్ అర్బన్, మే 11: ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లావ్యాప్తంగా పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ గౌస్ఆలం ఐపీఎస్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 599 పోలింగ్ ప్రాంతాలు, 783 పోలింగ్‌బూత్‌లు ఉన్నట్లు, పోలింగ్ లోకేషన్లు, 87 రూట్ల వద్ద, జిల్లాలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ల వద్ద, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద, ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. సిబ్బందికి అవగాహన కల్పించడానికి శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బందికి చేయవల్సిన విధులపై ముందుగానే తెలియజేయాలన్నారు. ప్రతీఒక్కరి వద్ద సంబంధిత రూట్‌మొబైల్ వాహనం అధికారి, ఉన్నతాధికారుల నెంబర్లను తెలపాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లో, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ స్టేషన్లలో, ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర బలగాలతో పహారాను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయబడిన స్ట్రాంగ్‌రూముల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్‌కు 48గంటల ముందు చేయవల్సిన కార్యాచరణపై అధికారులకు సూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా సిబ్బంది ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఎటువంటి డబ్బు, మద్యం, ఇతర బహుమతి వస్తువులు అక్రమ రవాణా జరుగకుండా,పోలింగ్ సెంటర్ల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రజలను క్యూలైన్లలో ఉండే విధంగా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రంలోనికి మొబైల్ ఫోన్లు, వాటర్ బాటిల్స్, ఇంక్, పెన్, మంటను కలిగించే వస్తువులకు అనుమతి లేదన్నారు. సిబ్బంది ప్రతీ ఒక్కరు లాటీలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల బందోబస్తులో దాదాపు 1100 జిల్లా పోలీసులు, 400 ఇతర శాఖలకు సంబంధించిన పోలీసులు, 27సెక్షన్ల కేంద్ర బలగాలు, 15 సెక్షన్ల స్పెషల్ పోలీసులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు సి.సమైజాన్‌రావు, బి.సురేందర్‌రావు, డీఎస్పీలు ఎల్.జీవన్‌రెడ్డి, పోతారంశ్రీనివాస్, బి.ప్రకాష్, బి.సురేందర్‌రెడ్డి, సీహెచ్ నాగేందర్, హసిబుల్లా, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిప్పర్‌వాడ చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

● ఆధారాలు చూపకపోవడంతో రూ.1.48 లక్షలు స్వాధీనం ● వివరాలు వెలడించిన ఎస్ఎస్‌టీ మేజిస్ట్రేట్ జ్ఞానేందర్‌షా

జైనథ్, మే 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్టు వద్ద శనివారం ఉదయం ఎస్ఎస్‌టీ మేజిస్ట్రేట్ జ్ఞానేందర్‌షా ఆధ్వర్యంలో రూ.1.48 లక్షల నగదును పట్టుకున్నారు. ఎస్ఎస్‌టీ టీం మేజిస్ట్రేట్ జ్ఞానేందర్ షా తెలిపిన వివరాల ప్రకారం.. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు(ఎంహెచ్ 49 బీఎం5499)ను తనిఖీ చేయగా అందులో ఉన్న 95వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కారు ఓనర్ అయిన సుమిత్, హరోర్‌పై కేసు నమోదు చేశారు. దీంతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న మరో కారు(కేఏ 53 ఎంఎల్9093)ను తనిఖీ చేశారు. అందులో రూ.53,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న కారు ఓనర్ కిషన్‌సింగ్ బదుర్‌యపై కేసు నమోదు చేశారు. నగదుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎస్ఎస్‌టీ టీం మేజిస్ట్రేట్ జ్ఞానేందర్‌షా నగదును సీజ్ చేశారు. ఇందులో పోలీసు కానిస్టేబుల్ శివాజీ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుకున్న నగదును చూపుతున్న జ్ఞానేందర్‌షా


ఉట్నూర్‌లో పోలింగ్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన బస్సులు

పోలింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి

● ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ఎల్ జీవాకర్‌రెడ్డి

ఉట్నూర్, మే 11: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరుగనున్న పోలింగ్ కోసం ఖానాపూర్ నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ఎల్ జీవాకర్‌రెడ్డి తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్, సిరికొండ, ఇంద్రవెల్లి, జన్నారం, దస్తూరాబాద్, పెంబి, కడెం, ఖానాపూర్ మండలాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా 309 పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 31 రూట్లలో 31 మంది సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించామని 309 పోలింగ్ స్టేషన్లకు కావాల్సిన ఎన్నికల సిబ్బందికి ఆదివారం ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో పోలింగ్‌కు కావాల్సిన ఏవీఎంలను, ఇతర పరికరాలను వారికి పంపిణీ చేస్తామన్నారు. పోలింగ్ సిబ్బంది వెళ్లడానికి కావాల్సిన ఒక వంద డెబ్బై బస్సులు జీపులు, కార్లు ఉపయోగిస్తున్నామన్నారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు.

బోథ్‌లో ఆరు మోడల్ పోలింగ్ కేంద్రాలు

బోథ్, మే 11: బోథ్ నియోజకవర్గ పరిధిలో 6 మోడల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బోథ్‌లోని బాలికల పాఠశాలలో, అలాగే ఇచ్చోడ మండలంలోని ముఖ్రా(కె), నేరడిగొండ మండలంలోని తేజాపూర్, గుడిహత్నూర్ మండలంలోని మున్నూరు, ఇచ్చోడ మండలంలోని ఇచ్చోడ పాఠశాలలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో 302 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఈసారి అదనంగా మరో నాలుగు కేంద్రాలు పెంచారు. మొత్తం 306 పోలింగ్ కేంద్రాలు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి.

'ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం'

గుడిహత్నూర్, మే 11: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా మంత్రిగా, ఎంపీగా ఉన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ఆదివాసీల కోసం చేసిందేమీ లేదన్నారు. బోథ్ నియోజకవర్గంలోని కుప్టి ప్రాజెక్టును నిర్మించి ఇక్కడి ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాను టూరిజం హబ్‌గా మారుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపిస్తే జిల్లా మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల కరుణాకర్, మాజీ జడ్పీటీసీ మస్కే మాధవ్, నాయకులు అంకతి రవీందర్, ముస్తఫా, గిత్తే తరుణ్, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

ఉదయం మండే ఎండ.. సాయంత్రం వాన!!

● ఇచ్చోడలో విచిత్ర పరిస్థితి ● సాయంకాలం ఒకసారిగా గాలివాన బీభత్సం ● వర్షపునీటితో నిండిపోయిన రోడ్లు

ఇచ్చోడ, మే 11: ఒ పక్క తీవ్ర ఎండ.. మరో పక్క ఒకేసారి ఇచ్చోడ పట్టణం ముసుగేసింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు ముసుగేశాయి. దీంతో చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం గాలి దూమరం, ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుసింది. దీంతో ఇచ్చోడలో రహదారులపై వరదనీరు. మురుగునీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఓవైపు రహదారి పనులు సాగడం రోడ్డుపై మొరం పనులు నడుస్తుండడతో రోడ్డుపై వరదనీరు చేరి రహదారిపై నడవరాకుండా మారింది. రోడ్లపై ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలు గాలితో నెలకోరిగాయి. పలుచోట్ల ఈదురుగాలులకు చెట్లు నెలకోరిగాయి. మండల కేంద్రంలని ఎస్సీ కాలనీలో గాలివానతో కూడిన వర్షానికి ముగ్గురి ఇంట్లో ఇంటిపైకప్పు లేచిపోయాయి. గాలివానతో ఇల్లు చెల్లచెదురు కావడంతో కుటుంబ సభ్యులు ఇంటిబయటకు వచ్చి దిగాలుచెందారు.


ఎస్సీకాలనీలో గాలిదూమరంతో చెల్లాచెదురైన రేకులు


ప్రధాన రహదారిపైకి చేరిన వర్షపు నీరు


ఇంటిపైకప్పు లేచిపోవడంతో బయటకి వచ్చిన కుటుంబసభ్యులు


ఇచ్చోడలో ఇంట్లోకి చేరిన వరదనీరు

ఆదిలాబాద్ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వాన

ఆదిలాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): పగలంతా భానుడు భగభగలతో భారీగా ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నా.. సాయంత్రం వేళల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. శనివారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 28.2 డిగ్రీలుగా నమోదైంది. గత నాలుగైదు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. అత్యధికంగా భీంపూర్ మండలంలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా ఆదిలాబాద్ రూరల్ మండలంలో 41.8, బేలలో 41.1, మావలలో 40.9, ఆదిలాబాద్‌అర్బన్‌లో 40.6 గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగితా చోట్ల 40డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా సిరికొండ, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నిత్యం ఉదయం, సాయంత్రం భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. అనాధికారిక విద్యుత్ కోతలతో, తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మున్ముందు ఎండల తీవ్రత మరింత ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొంటోంది.

ఉపాధి కూలీకి తలకు గాయం

ఉట్నూర్, మే 11: ఉట్నూర్ మండలంలోని లక్కారంకు చెందిన ఉపాధి హామీ కూలీ స్వరూపరాణి తలకు గాయమైంది. ఉపాధి హామీ పనులు చేస్తుండగా శనివారం గడ్డపార తలకు తగలడంతో తీవ్రరక్తస్రావం కావడం గమనించిన తోటి కూలీలు కుటుంబ సభ్యులతో కలిసి మండల కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి తలకు తీవ్ర గాయం అయిన చోట మూడు కుట్లు వేసి కట్టు కట్టారు. ఉపాధి హామీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉంచక పోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువరు కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పని ప్రదేశంలో కావాల్సిన సౌకర్యాలను ఉపాధి కూలీలకు అందుబాటులో ఉంచాలని వారు కోరుతున్నారు.


తలకు గాయమైన స్వరూపరాణి

సంప్రదిస్తే చాలు.. సమస్యలు పరిష్కరిస్తా


● గోల్లగాడ్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్, మే 11: సంప్రదిస్తే చాలు.. సమస్యలు పరిష్కరిస్తామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆయన శనివారం పలువురు పార్టీ నాయకులతో కలిసి భీంపూర్ మండలంలోని మారుమూల ప్రాంతం అయిన గోళ్లగాడ్‌ను సందర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించిన నేపథ్యం ఆ గ్రామానికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీ ఎన్నికల్లో పాల్గొని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పిలువక పోయిన మా గ్రామాన్ని సందర్శించినందుకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో నాయకులు కేమ గంగయ్య, తదితరులున్నారు.


గోళ్లగాడ్ గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



ముగిసిన ప్రచారం



- ఇక అంతా రహస్యం
- గెలుపుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ధీమా
- జిల్లాలో మెజార్టీ ఓట్లపై పార్టీల ఆశలు
- నేడు మొదలుకానున్న అసలు సీన్

నిర్మల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : గత నెల రోజుల నుంచి హోరెత్తిన లోక్‌సభ ఎన్నికల బహిరంగ ప్రచారానికి ఎట్టకేలకు తెరపడింది. గత అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా ఈసారి లోక్‌సభ ఎన్నికల ప్రచారపర్వం కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీ తన దైన మార్కుతో పాటు మందీమార్బలంతో ప్రచారపర్వం కొనసాగించగా ఈసారి మాత్రం అందుకు భిన్నంగా ప్రచారంలో వెనకబడిందన్న వాదనలున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు జిల్లాలో హోరాహోరీ ప్రచారాన్ని నిర్వహించి నువ్వా నేనా అన్న రీతిలో తలపడుతున్నాయి. నెల రోజుల నుంచి అన్ని పార్టీల అభ్యర్థులు వారికి మద్దతుగా అగ్రనేతలు, కార్యకర్తలు ఊరూరా ప్రచారాన్ని నిర్వహించారు. గతానికి భిన్నంగా ఈ సారి మూడు ప్రధానపార్టీలు ఉపాధిహామీ కూలీలనే లక్ష్యంగా చేసుకొని వారి ఓట్ల కోసం తంటాలు పడ్డాయి. పార్టీలన్నీ పోటాపోటీగా ఉదయమే ఉపాధి కూలీలు పనిచేస్తున్న చోటికి వెళ్లి వారిని కలిసి ఓట్లను అభ్యర్థించాయి. తమ పార్టీల మేనిఫెస్టోలను వివరిస్తూ వారి మద్దతు కూడగట్టేందుకు తంటాలు పడ్డాయి. కూలీలకు పార్టీలు ప్రత్యేకంగా టెంట్లను వేయించి పనులు చేసే చోటే మినీ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రసంగాలు కొనసాగించాయి. అయితే ఉపాధి కూలీలు అన్ని పార్టీలకు సమాన ఆదరణ కనబర్చడంతో వారి ఓట్లపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లెక్కలు కడుతున్నాయి. ఇదిలా ఉండగా ఇక బహిరంగ ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. శనివారం రాత్రి ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఇక రహస్య యంత్రాంగం నడిపేందుకు అన్ని పార్టీలు రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాయంటున్నారు. ఈ 24గంటల్లో అసలు సీన్ మొదలుకాబోనుందని, ఓటర్లను పెద్దఎత్తున ప్రభావాలకు గురి చేసే అవకాశాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ 24 గంటలు అన్ని పార్టీలకు కీలకం కానున్నాయంటున్నారు. కాగా ఈ సారి కాంగ్రెస్ పార్టీ తరఫున ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. నిర్మల్‌లో జరిగిన బహిరంగసభకు రాహుల్‌గాంధీ హాజరు కావడమే కాకుండా నాయకులు, కేడర్ మధ్య సమన్వయం నింపే ప్రయత్నం చేశారు. రాహుల్ సభసక్సెస్ కావడంతో ఆ పార్టీ కొత్త ఉత్సాహం నెలకొంది. కాగా బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆ పార్టీ అగ్రనేత కేటీఆర్ కూడా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. నిర్మల్‌లో జరిగిన రోడ్‌షోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ పార్టీ మాత్రం ఇప్పటి వరకు ఏ ఒక్క అగ్రనేతను సైతం రంగంలోకి దించకుండా స్థానిక నాయకులతోనే ప్రచారపర్వాన్ని ఉధ్రూతలూగిస్తోంది.

ముగిసిన ఎన్నికల ప్రచారం

లోక్‌సభ ఎన్నికల బహిరంగ ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసిపోయింది. ఇక ప్రత్యక్ష ఎన్నికకు ఒకటే రోజు ఉన్న కారణంగా ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్ని పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఓటర్లను నయానో భయానో ఒప్పించి ఓటు తమకే పడేట్లు చేసుకునేందుకు పార్టీలు తంటాలు పడనున్నాయి. ఆఖరి రోజున ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో సీనియర్ నాయకులు ఇప్పటికే కేడర్‌కు సూచించినట్లు సమాచారం. మద్యం, నగదు పంపిణీ కూడా పెద్దఎత్తున జరిగే అవకాశాలు లేకపోలేదంటున్నారు. ఇప్పటికే తమ వద్ద ఉన్న జాబితాల ఆధారంగా ఓటర్ల ఇంటికి వెళ్లి వారికి ఒప్పించి ఓటు తమ పార్టీకే పడేట్లు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రచారంలో హోరాహోరీగా తలపడగా బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఈ సారి ప్రచారంలో వెనకబడడం, ఆ పార్టీకి చెందిన నేతలు కార్యకర్తలంతా వరుస కట్టి కాంగ్రెస్, బీజేపీలో చేరిపోవడంతో ప్రస్తుతం ఆ పార్టీ పూర్తిగా డీలాపడిపోయిందని అంటున్నారు.

హోరాహోరీగా బీజేపీ, కాంగ్రెస్‌లు


నిర్మల్ జిల్లాలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ ఎన్నికల ప్రచారాన్ని హోరాహోరీగా ముగించాయి. బీఆర్ఎస్ పార్టీ తన ప్రచార పర్వంలో వేగం పెంచేందుకు ప్రయత్నించినప్పటికి ఈ రెండు పార్టీలకు దీటైన సమాధానం ఇవ్వలేకపోయిందని అంటున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వ్యూహాత్మకంగా తమ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తూ మరోవైపు అనుబంధ సంఘాలను రంగంలోని దించాయి. పోటాపోటీగా నువ్వంటే నువ్వనే రీతిలో ఈ సారి ఈ రెండు పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. అయితే బహిరంగ సభలు తక్కువగానే నిర్వహించినప్పటికీ క్షేత్రస్థాయి ప్రచారపర్వంపై ప్రతీరోజూ సమీక్షలు చేయడం ఈ సమీక్షలకు అనుగుణంగా మరుసటి రోజూ ప్రచారవ్యూహాలను అమలు చేస్తూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కొత్త ఎత్తుగడలను రూపొందించాయి. ఈ రెండు పార్టీలు బీఆర్ఎస్ పార్టీ నుంచి భారీగా నేతలను తమ తమ పార్టీలోకి చేర్చుకోవడంతో ఇటు సీనియర్ నాయకులు, కేడర్‌లో కూడా కొంత మేరకు ఉత్సాహం నెలకొందని అంటున్నారు. అయితే మరికొంత మంది గ్రామస్థాయి నాయకుల కారణంగా పార్టీలో చేరడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మొత్తానికి ఈ సారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రసవత్తరమైన రాజకీయాలకు కేంద్ర బిందువయ్యాయి.

నాయకత్వ కొరతతో బీఆర్ఎస్ తంటాలు

బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కొరతతో ఈ సారి ప్రచారపర్వంలో ఇబ్బందులు ఎదుర్కొందని అంటున్నారు. పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకపోవడం అలాగే ఎప్పటికప్పుడు సమీక్షలు జరగకపోవడం, ఎదుటి పార్టీల వ్యూహాలను ఎదుర్కొలేకపోవడం, వరుస వలసలు పెరిగిపోవడం ఆ పార్టీ ప్రచారానికి ఆటంకాలయ్యాయి. అయినప్పటికీ ఆ పార్టీ అభ్యర్థి ఆత్రంసక్కు పట్టు వదలకుండా జిల్లాలో పలుసార్లు పర్యటించి ప్రచారం చేపట్టారు. గత వైభవం కనిపించకపోయినప్పటికీ వెనకడుగు వేయకుండా ఆత్రంసక్కు ప్రచారాన్ని నిర్వహించారు. ఆ పార్టీ అగ్రనేత కేటీఆర్ జిల్లాలో పర్యటించి కేడర్‌కు ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. అయితే భైంసాలో కేటీఆర్‌కు నిరసన సెగ తగలడం ఆయన తక్కువ సేపు మాత్రమే ప్రసంగించి వెళ్ళిపోవడం లాంటి పరిణామాలు అక్కడి ఓట్లపై ప్రభావం చూపవచ్చంటున్నారు.

యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- ప్రేమ వ్యవహారమే కారణం
- ఎస్పీ జానకి షర్మిల వెల్లడి



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, మే 11 : నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం యువకుడు జిశాన్ హత్యకేసులో నిందితుడు మహమ్మద్ సుమైర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ హత్యకు ఇద్దరు వ్యక్తుల మధ్య ప్రేమ వ్యవహారమే కారణమని నిర్ధారించినట్లు తెలిపారు. అబ్దుల్ జిశాన్ అనే డ్రైవర్ గత నాలుగేళ్ల క్రితం ఓ అమ్మాయిని ప్రేమించాడని తరువాత ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో విడిపోయారని తెలిపారు. అదే అమ్మాయిని గత కొన్ని నెలలుగా నిందితుడు సుమైర్ ప్రేమిస్తున్నాడని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న మృతుడికి తెలిసి ఇద్దరి మధ్య గొడవలు జరిగాయన్నారు. శుక్రవారం సాయంత్రం సమయంలో జిశాన్ నిందితుడికి ఫోన్ చేసి నీతో మాట్లాడేది ఉంది రమ్మని చెప్పగా నిందితుడు నిర్మల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లాడన్నారు. అప్పటికే మృతుడు జిశాన్ అతని స్నేహితులు అజ్మత్, మతిన్‌లతో అక్కడ ఉన్నాడని తెలిపారు. వీరు ముగ్గురు మాట్లాడుతుండగా నిందితుడు నీతో వ్యక్తిగతంగా మాట్లాడాలని జిశాన్‌కు చెప్పగా అతని స్నేహితులు దూరం వెళ్లారని అన్నారు. అంతలోనే నిందితుడు తనవెంట తెచ్చుకున్న కత్తితో జిశాన్‌ను గొంతుపైన వీపులో బలంగా దాడి చేశాడన్నారు. అడ్డుగా వచ్చిన మతిన్‌పై కూడా దాడికి పాల్పడగా గాయాలయ్యాయన్నారు. జిశాన్ స్నేహితులు అజ్మత్, మతిన్‌లు హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం నిజామాబాద్ తరలించామని వెల్లడించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం 7:45 గంటలకు మృతి చెందాడన్నారు. జిశాన్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడు సుమైర్‌ను అరెస్ట్ చేసి అతను ఉపయోగించిన కత్తి, మొబైల్ స్వాధీనం చేసుకున్నామని, రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. కేసు ఛేదించిన పోలీస్ అధికారులను ఎస్పీ ప్రశంసించారు. డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ బి. అనిల్ సమావేశంలో పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

నిర్మల్ కల్చరల్, మే 11 : జిల్లాకేంద్రంలో ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్వేచ్ఛ వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు భరోసా కల్పించేందుకు ఈ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. పాత బస్టాండ్, చింతకుంట వాడ, గుల్జార్ మార్కెట్, గాంధీ చౌక్, బుధవార్ పేట్, తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ అనిల్, పోలీసులు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేయొద్దు

- సమస్య పునరావృతమైతే చర్యలు తప్పవు
- ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహకులపై అదనపు కలెక్టర్ ఆగ్రహం
- ఖానాపూర్‌లో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలన
- రైతులు ఆందోళన చెందవద్దని భరోసా
- యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరుగుతాయన్న అదనపు కలెక్టర్



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

ఖానాపూర్, మే 11 : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేయొద్దని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై జిల్లా అదనపు కలెక్టర్ ఎల్. కిషోర్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. తమకు కనీసం టార్పాలిన్ కవర్లు కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని పీఏసీఎస్ సీఈవో ఆశన్నపై పలువురు రైతులు జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తాము రెండు మూడు రోజులుగా టార్పాలిన్ కవర్లు ఇవ్వాలని అడిగినప్పటికీ పీఏసీఎస్ సీఈవో ఆశన్న నిర్లక్ష్యపు సమాధానాలు చెప్పారన్నారు. దీంతో తమ ధాన్యం అకాల వర్షానికి తడిసిపోవాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. రైతుల ఆవేదన విన్న అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ సెంటర్ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోసారి ఇటువంటి సమస్యలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తక్షణమే ధాన్యాన్ని తూకం వేయాలని ఆదేశించారు. లారీల కొరత లేకుండా సంబంధిత శాఖ అధికారులను ఆదేశిస్తున్నట్లు తెలిపారు. రైతులు సైతం తడిసిన ధాన్యాన్ని కాస్త ఆరబెట్టాలని సూచించారు. అందుబాటులో టార్పాలిన్ కవర్లు ఉన్నందున వెంటనే రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం ఆరబెట్టిన రైతులకు టార్పాలిన్ కవర్లను అందజేశారు. రైతులు ఆందోళన చెందవద్దని యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరుగుతాయని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ రైతులకు భరోసా కల్పించారు. ఆయన వెంట స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

పోలింగ్‌స్టేషన్లను పరిశీలించిన డీపీవో

నిర్మల్ అర్బన్, మే 11 : రేపు జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నర్సాపూర్(జి) మండలంలో పోలింగ్‌స్టేషన్లను శనివారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. నర్సాపూర్(జి) మండల కేంద్రంతో పాటు భామ్ని గ్రామంలో పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద త్రాగునీటి వసతితో పాటు ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లు చూడాలన్నారు. పోలింగ్ స్టేషన్లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



పోలింగ్‌స్టేషన్లను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



గుండంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



దిలావర్‌పూర్ పోలింగ్ కేంద్రంలో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కలెక్టర్

03. ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

దిలావర్‌పూర్, మే 11 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వరి కొనుగోలు ప్రక్రియ నిరంతరం జరగాలని ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. అకాలవర్షాలు కురుస్తున్నందున రైతులకు సరిపడినన్ని టార్ఫాలిన్లను, గన్నీబ్యాగులను అందుబాటులో ఉంచాలని, మరిన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సకాలంలో మిల్లులకు పంపాలని ఆదేశించారు. అవసరమైతే ధాన్యం తరలింపుకు అదనపు లారీలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యపు వివరాలను ట్యాబ్, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులంతా ఖచ్చితంగా ప్యాడి క్లీనింగ్ మిషన్ల ద్వారా ధాన్యాన్ని శుభ్రపరచిన తర్వాత మాత్రమే విక్రయించాలన్నారు. వరి కొనుగోలు కేంద్రం వద్ద గల తూకపు యంత్రాలు, ప్యాడి క్లీనింగ్ యంత్రాలు, తేమ యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాలలోని 282, 288 నెంబర్ పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ర్యాంప్, ఫర్నిచర్, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులకు సంబంధించిన ఫోన్ నెంబర్లతో వివరాల సమాచారపు పోస్టర్లను అతికించాలని ఆదేశించారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న మరమ్మతుల పనులను పరిశీలించారు. నిర్దేశిత గడువులోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్ల మరమ్మతు పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకళ, తహసీల్దార్ స్వాతి, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల మధ్య ఎన్నికలు నిర్వహించండి

నిర్మల్ కల్చరల్, మే 11 : ఈ నెల 13న నిర్మల్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో పోలీసు శాఖ గట్టి భద్రత చర్యలు చేపట్టి శాంతి భద్రతల నడుమ ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రానికి ముగిసిందన్నారు. 48 గంటల ముందు రాజకీయ పార్టీలు ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, టెలివిజన్ ప్రసార ప్రచారాలు నిర్వహించరాదని తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలు చేయాలని, ఐదుగురి కంటే ఎక్కువ తిరుగకుండా చూడాలన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. ఖానాపూర్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో ఎన్నికలు నిర్వహించాలన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుండి 14 తేదీ సాయంత్రం 6 గంటల వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. ఇంటింటి ప్రచారానికి ఈ నిబంధనలు వర్తించవన్నారు.

నేడు ఉదయం 7 గంటలకు ఎన్నికల సిబ్బంది హాజరు కావాలి

పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఈ నెల 12న ఆదివారం ఉదయం 7 గంటలకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి హాజరుకావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. గైర్హాజరైన సిబ్బందిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : అదనపు కలెక్టర్



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్, హాజరైన ఎన్నికల అధికారులు, సిబ్బంది

నిర్మల్ కల్చరల్, మే 11 : ఈ నెల 13న ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. శనివారం నిర్మల్ సెగ్మెంట్ పరిధిలో విధులు నిర్వహించే అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు ఉదయం ఈవీఎం పంపిణీ కేంద్రానికి వచ్చి అన్ని సరిచూసుకోవాలన్నారు. సకాలంలో పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలన్నారు. సమయానికి పోలింగ్‌శాతం డేటా ఎంట్రీయాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈవీఎంల సమస్యలు తలెత్తితే ఎలాంటి ఆటంకాలు కలుగకుండా పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్లు, ఫారంలు నింపడంపై అవగాహన కల్పించారు. కేంద్రాల వద్ద ఏవైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రాజకీయ పార్టీలు ఆహార పదార్థాలు, మజ్జిగ తదితర వాటిని పంపిణీ చేయకుండా చూడాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైనీ లు సిబ్బందికి విధుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆర్డీవో రత్న కళ్యాణి, మాస్టర్ ట్రైనీలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దాడి చేసిన పలువురి అరెస్ట్

నిర్మల్ కల్చరల్, మే 11 : నిర్మల్ పట్టణం బస్టాంగ్ సమీపంలోని నీలాయిపేట ఆటో అడ్డాపార్కింగ్ వద్ద మోటార్ సైకిల్ పార్కింగ్ విషయంలో చెలరేగిన గొడవకు కారణమైన వ్యక్తులను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ అనిల్ తెలిపారు. నీలాయిపేటకు చెందిన మహేందర్, తదితరులకు గాయాలు కాగా వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దాడిలో పాల్గొన్న సైఫ్, షైక్‌ఇర్ఫాన్, మహమ్మద్ ముజామీర్, అర్బాస్ ఖాన్, ఎండీ ఫయాజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, రౌడీయిజం ప్రదర్శిస్తే చట్టరీత్యా చర్యలుంటాయని హెచ్చరించారు.

మూతపడ్డ మద్యం షాపులు



భైంసాలో బార్‌ను మూసి వేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

భైంసా, మే 11: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం 5 గంటల నుంచి జిల్లాలోని మద్యం షాపులు మూతపడ్డాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎక్సైజ్‌శాఖ కమీషనర్, కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని 47 మద్యం షాపులు, 8 బార్ అండ్ రెస్టారెంట్లు శనివారం నుంచి సోమవారం వరకు మూతపడ్డాయి. లోక్‌సభ పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం సోమవారం సాయంత్రం 6 గంటలకు వైన్స్ షాపులు తెరుచుకోనున్నాయి. మద్యం షాపుల మూసివేతకు సంబంధించిన ముందస్తు సమాచారం ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లకు పంపిణీ చేసేందుకు గాను రెండు రోజులుగా మద్యం నిల్వలను ప్రతి గ్రామంలోనూ డంప్ చేసినట్లుగా తెలిసింది.

'అరెస్టు చేయడం అన్యాయం'

ముథోల్, మే 11 : భైంసాకు వచ్చిన కేటీఆర్ సభలో నిరసన తెలిపిన హనుమాన్ మాలదారులను అరెస్టు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు పటేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాముడి భక్తులైన అంజన్న స్వాములు శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. కేటీఆర్ రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని ఆరోపించారు. కేటీఆర్ కొన్ని సభల్లో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. హిందూ మనోభావాలను కించపరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.